క్లుప్తంగా

ఎస్సీ స్టడీసర్కిల్ ప్రవేశాలకు హాల్ టికెట్ల జారీ

సిరిసిల్లకల్చరల్: సిరిసిల్లలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఎస్సీ స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని ఎస్సీ అభివృద్ధి అధికారి వినోద్‌కుమార్ గురువారం ప్రకటనలో ప్రకటనలో తెలిపారు. వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్లు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. ఈనెల 10న ఉదయం 10 నుంచి ఒంటి గంట వరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగే ప్రవేశ పరీక్షకు అభ్యర్థులు సకాలంలో హాజరుకావచ్చని వివరించారు.

ఆహ్వానపత్రిక అందజేత



ఆగయ్యకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న గౌడసంఘం సభ్యులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని నారాయణపూర్‌లో ఈనెల 11,12 తేదీల్లో నిర్వహించే శ్రీ రేణుకామాత-జమదగ్ని కల్యాణ వేడుకలకు రావాలని గురువారం బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్యకు గౌడసంఘం సభ్యులు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఎల్లారెడ్డిపేటలోని ఆయన నివాసంలో కలిసి వేడుకలకు రావాలని కోరారు. ఆగయ్యతో పాటు మండలంలోని ప్రజాప్రతినిధులను వేడుకలకు ఆహ్వానించారు. గౌడ సంఘం ఉపాధ్యక్షుడు బొల్గం రాధాకృష్ణగౌడ్, బొల్గం గోవర్ధన్ గౌడ్, వందిర్ల పర్శరాములు గౌడ్, శ్రీనివాస్ గౌడ్, హైదరి రాజు, ఎడ్ల సందీప్, తదితరులున్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

ఎల్లారెడ్డిపేట: గృహజ్యోతికి అర్హులైన వినియోగదారులు మండలపరిషత్ కార్యాలయంలో అధికారులను సంప్రదించాలని సెస్ ఏఈ పృథ్వీధర్ గౌడ్ తెలిపారు. సెస్ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడారు. బిల్లులు వచ్చినవారు మండల పరిషత్‌లోని ప్రజాపాలన కౌంటర్‌లో ప్రజాపాలన దరఖాస్తుతో పాటు రేషన్ కార్డు, ఆధార్‌కార్డు, విద్యుత్ బిల్లు జిరాక్స్‌లు అందించాలన్నారు.

ప్రమాదానికి కారణమైన వ్యక్తికి ఏడాది జైలు

సిరిసిల్లక్రైం: కారును వేగంగా నడుపుతూ ప్రమాదానికి కారణమైన వ్యక్తికి ఏడాది జైలుతో పాటు రూ.3వేలు జరిమాన విధిస్తూ సిరిసిల్ల ప్రథమశ్రేణి మేజిస్ట్రేట్ ప్రవీణ్ గురువారం తీర్పు వెల్లడించినట్లు ఎస్సై శేఖర్ రెడ్డి తెలిపారు. 2018 జూన్ 12న ఎల్లారెడ్డిపేటకి చెందిన మాలోతు తుకారాం తన స్నేహితుడు భూక్య శ్రీనివాస్‌తో కలిసి కారులో సిద్దిపేటకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో శ్రీనివాస్ కారు డ్రైవింగ్ చేస్తుండగా తుకారాం పక్కన కూర్చున్నాడు. కారును అతివేగంగా నడపడంతో ముస్తాబాద్ మండలం బధనకల్ కారు బోల్తాపడింది. ఈ ప్రమాదంలో తుకారాం తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో క్షతగాత్రుడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసి, కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టు మానిటరింగ్ ఎస్సై శ్రవణ్ యాదవ్, కోర్టు కానిస్టేబుల్ దేవేందర్ కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ సందీప్ వాదించారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన అనంతరం నిందితుడికి ఏడాది జైలు, రూ.3 వేలు జరిమానా విధించినట్లు ఎస్సై శేఖర్ రెడ్డి పేర్కొన్నారు.

అనుమతులు లేని నిర్మాణాలపై చర్యలు

ముస్తాబాద్: పట్టణంలో అనుమతులు లేకుండా ఇంటి నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామని ప్రత్యేకాధికారి సురేశ్, ఇన్‌చార్జి కార్యదర్శి శ్రీనివాస్ అన్నారు. మండలకేంద్రంలో సెల్లార్ల నిర్మాణంపై వచ్చిన ఫిర్యాదులపై గురువారం వారు మాట్లాడారు. నిబంధనలు అతిక్రమించి పనులు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. పట్టణంలో అనుమతులు తీసుకున్న వారు మాత్రమే నిర్మాణాలు చేస్తున్నారన్నారు. అక్రమ కట్టడాలపై కలెక్టర్, డీపీవో దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

27 మందికి జరిమానా

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలో మద్యంతాగి వాహనాలు నడిపిన 23మందికి, బహిరంగ ప్రదేశాల్లో మద్యంతాగిన నలుగురికి జరిమానా విధించినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. 27 మందికి సిరిసిల్ల అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి సృజన జరిమానా విధించారన్నారు. ఆరుగురికి రూ.2వేలు, 17 మందికి రూ.1000, నలుగురికి రూ.250చొప్పున విధించారు.

పుస్తకాల వితరణ

సిరిసిల్లకల్చరల్: ఆధునిక పోటీ ప్రపంచంలో రాణించేందుకు ఇంగ్లిష్ భాషా అవసరమని అని పలువురు వక్తలు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహతి మహిళా డిగ్రీ కళాశాలలో స్పోకెన్ ఇంగ్లిష్ పుస్తకాలను అందించారు. ప్రముఖ ఇంగ్లిష్ భాషా నిపుణులు బూర శ్రీనివాస్, జేఎస్ అరవింద్ హాజరయ్యారు. ప్రదీప్తి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గెంట్యాల భూమేశ్‌ను అభినందించారు. ఫైనల్ ఇయర్ చదువుతున్న 150 మంది విద్యార్థులకు బూర శ్రీనివాస్ రూపొందించిన స్పోకెన్ ఇంగ్లిష్ పుస్తకాలు అందించారు. కళాశాల అధ్యాపక సిబ్బంది రాజేందర్, శరత్, డి. రమేశ్, లక్ష్మి, స్వామి, విద్యార్థులు పాల్గొన్నారు.

మహాశివరాత్రికి ఆలయాలు ముస్తాబు

మహా శివరాత్రి సందర్భంగా సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లోని పలు శివాలయాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. బోయినపల్లి, కోనరావుపేట, ఎల్లారెడ్డిపేట, రుద్రంగి మండలాల్లో రంగు రంగుల విద్యుత్ దీపాలతో ఆలయాలను అలంకరించారు. శుక్రవారం ఆలయాల్లో స్వామివారి కల్యాణాలతో పాటు ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు. ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించనున్నట్లు ఆలయాల కమిటీ సభ్యులు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేసినట్లు వారు పేర్కొన్నారు.



నారాయణపూర్ శివాలయంలో హోమం కాలుస్తున్న వేద పండితులు

మూడ్రోజులు బ్రహ్మోత్సవాలు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని నారాయణపూర్‌లో శ్రీరాజరాజేశ్వరస్వామి వేములవాడ దత్తత దేవాలయమైన శివాలయంలో మహా శివరాత్రి సందర్భంగా గురువారం నుంచి మూడ్రోజుల పాటు బ్రహ్మోత్సవాలను ఏటా ఘనంగా నిర్వహిస్తారు. వేద పండితులు వేణుగోపాలచారి ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో ధ్వజ స్తంభానికి నందీశ్వరుడి చిత్రపటాన్ని కట్టి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం హోమం నిర్వహించి పూజలు చేశా రు. శనివారం ఉదయం పూర్ణాహుతితో పూజ లు ముగుస్తాయని పండితులు వేణుగోపాలాచారి తెలిపారు. ఆలయ కమిటీ చైర్మన్ సూర నర్సయ్య, మాజీ సర్పంచులు దొమ్మాటి నర్సయ్య, నిమ్మ లక్ష్మి, ఎంపీటీసీ అపెరా సుల్తానా, సుధాకర్ రెడ్డి, లక్ష్మారెడ్డి, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.



ముస్తాబైన విశ్వనాథ ఆలయం



శివనగర్‌లోని శ్రీరాజ రాజేశ్వరస్వామి ఆలయం

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల పట్టణంలోని అన్ని శివాలయాలు మహా శివరాత్రి జాతరకు ముస్తాబయ్యాయి. శివనగర్ శ్రీరాజ రాజేశ్వరస్వామి, పాత శివాలయం, మడేలేశ్వరాలయం, మార్కండేయ స్వామి, విశ్వనాథాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివ మాలాధారులు ఆలయాల్లో భజనలు, కీర్తనలు జరిపారు. స్థానిక శివనగర్ ఆలయంలో మహా శివరాత్రి సందర్భంగా ఉదయం 4 నిత్య పూజా కార్యక్రమం, 5 గంటలకు శ్రీ విఘ్నేశ్వర పూజ, స్వస్తి పుణ్యాహవాచనం, నవగ్రహ ఆరాధనలు, ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిరంతర జలాభిషేకం, సాయంత్రం అఖండ దీపారాధన, జాగరణ, అఖండ నామస్మరణ పారాయణం, రాత్రి 12గంటలక లింగోద్భవం జరుపుతున్నట్లు ఆలయ కమిటి సభ్యులు తెలిపారు. గురువారం శివనగర్ ఆలయం నుంచి శివభక్తులు స్వామివారి శోభాయాత్రను పట్టణంలో నిర్వహించారు.

బోయినపల్లి(చొప్పదండి): విలాసాగర్ శ్రీ త్రిలింగ సంగమేశ్వర స్వామి ఆలయం ఉత్సవాలకు ముస్తాబవుతోంది. నేటినుంచి ఈనెల 10వ వరకు జాతర ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. జాతరతోపాటు ప్రత్యేక ఉత్సవాలు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు

కోనరావుపేట: మండలంలోని గ్రామాల్లో శివాలయాలు ముస్తాబయ్యాయి. నిజామాబాద్‌లోని రామలింగేశ్వరస్వామి ఆలయం, వట్టిమల్ల శివసాయి ఆలయం, కోనరావుపేటలోని హనుమాన్ దేవాలయం, మామిడిపల్లిలోని మహాదేవ ఆలయం, కనగర్తిలోని రాజరాజేశ్వరస్వామి ఆలయాలు ముస్తాబయ్యాయి.

రుద్రంగి: మండలకేంద్రంలోని శ్రీ బుగ్గ రాజరాజేశ్వర స్వామి ఆలయాన్ని ఆలయ కమిటీ సభ్యులు రంగురంగుల విద్యుత్‌దీపాలతో అలంకరించారు.

ఎన్గల్ శివాలయంలో శివస్వాముల పూజలు



ఎన్గల్ శివాలయం

చందుర్తి (వేములవాడ): మండలంలోని ఎన్గల్ శివాలయం మహా శివరాత్రి వేడుకలకు ముస్తాబైంది. ఉదయం నుంచే ఉత్సవాలు ప్రారంభమవుతాయని ఆలయ అర్చకులు తెలిపారు. శివస్వాముల భజనలతో గురువారం రాత్రి శివాలయ ప్రాంగణమంతా శివ నామస్మరణతో మారుమోగింది. శుక్రవారం ఆలయ అర్చకులు లక్ష్మణాచార్యులు మంత్రోచ్చారణ మధ్య గణపతి పూజ, పుణ్యవచనం, వంటి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. శనివారం కుంకుమార్చన, అర్చన, బిల్వార్చన, శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తామని తెలిపారు. ఏటా స్వామివారిని 2వేలకు పైగా భక్తులు దర్శించుకుంటారు. నిజామాబాద్ జిల్లా సిరికొండ, ఆర్మూర్ ప్రాంతాల శివస్వాములు శివాలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు గంగాధర్, ప్రధాన కార్యదర్శి లాండే ప్రసాద్ వివరించారు.

పారదర్శకంగా ‘ఉపాధి’పనులు చేపట్టాలి

- పనుల్లో అవకతవలకు పాల్పడితే చర్యలు
- ఎల్లారెడ్డిపేటలో సామాజిక తనిఖీ కార్యక్రమం
- ఉపాధి సిబ్బందికి రూ.5వేల జరిమానా, రూ.35వేల రికవరీ



మాట్లాడుతున్న డీఆర్డీవో శేషాద్రి

ఎల్లారెడ్డిపేట: గ్రామాల్లో ఉపాధిహామీ పనులను పారదర్శకంగా చేపట్టాలని, పనుల రికార్డులు, వేతనాల చెల్లింపులో అవకతవకలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని డీఆర్డీవో శేషాద్రి అన్నారు. మండలపరిషత్ కార్యాలయంలో గురువారం ఉపాధిహామీ సామాజిక తనిఖీ నివేదిక నిర్వహించారు. వివిధ పనులు, రికార్డుల్లో అవకతవకలకు పాల్పడిన ఫీల్డ్ అసిసెంట్లు, పంచాయతీ కార్యదర్శులకు రూ.5వేల జరిమానా విధించడంతో పాటు రూ.35,216ను వారి నుంచి రికవరీ చేశారు. పలువురు ఉపాధి సిబ్బందికి నోటీసులు జారీచేశారు. ఈ సందర్భంగా డీఆర్డీవో మాట్లాడుతూ..2022-23 ఆర్థిక సంవత్సరంలో 660 పనులు చేపట్టినట్లు తెలిపారు. 24 గ్రామ పంచాయతీలకు సంబంధించి రూ.67.72కోట్లు వేతనాల రూపంలో, రూ.96 లక్షలను మెటీరియల్ కోసం ఖర్చుచేసినట్లు తెలిపారు. అనంతరం ఎంపీపీ పిల్లి రేణుక మాట్లాడుతూ జాబ్ కార్డులున్న వారంతా ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వేసవిలో కూలీ లకు వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పనుల్లో అవినీతికి పాల్పడే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీడీవో సత్తయ్య, ఈజీఎస్ విజిలెన్స్ అధికారి రామారావు, ఏపీవో కొమురయ్య,గ్రామాల ప్రత్యేక అధి కారులు,ఎంపీటీసీ సభ్యులు,ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



బాబూన్‌కు పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఆది శ్రీనివాస్

వేములవాడ: మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు బాబూన్(సర్వర్‌పాషా) గురువారం బీఆర్‌ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ బాబూన్‌కు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ బింగి మహేశ్, నాయకులు సాగారం వెంకటస్వామి, సంద్రగిరి శ్రీనివాస్‌గౌడ్, సాబీర్, యూసుఫ్ పాల్గొన్నారు.

పరామర్శ

చందుర్తి : మండలంలోని మల్యాలలో బాధిత కుటుంబాలను ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ గురువారం పరామర్శించారు. వివిధ కారణాలతో మృతిచెందిన నునుగొండ సత్తమ్మ, రంబ లింగయ్య కుటుంబ సభ్యులను ఆది శ్రీనివాస్ ప్రగాఢ సానుభూతి తెలిపారు. నాయకులు ఈసరి శ్రీనివాస్, మల్లారపు రాజయ్య, పంచెరుపుల దేవలింగు, పొంచెట్టి వెంకటేశ్, కొట్టే కిష్టయ్య, కాసర్ల వెంకటి, తదితరులున్నారు.

విద్యార్థులకు నగదు బహుమతి



బోయినపల్లి: మండలకేంద్రంలోని మోడల్ స్కూల్‌లో, కేజీబీవీ, హైస్కూల్ విద్యార్థులకు గురువారం మ్యాథ్స్ టాలెంట్ సెర్చ్ పరీక్షలు నిర్వహించారు. ప్రథమ స్థానంలో నిలిచిన కేజీబీవీ విద్యార్థి ఎం. ప్రణీతకు రూ. 2,016, ద్వితీయ స్థానంలో కే. హర్షితకు రూ. 1,016, లాలన, భావనలకు రూ. 516 చొప్పున నగదు బహుమతులు అందించారు. మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ నిమ్మల సుధాకర్, కేజీబీవీ ఎస్‌ఓ పద్మ, అనంతపల్లి మాజీ సర్పంచ్ వంగపల్లి సత్యనారాయణ రెడ్డి, ప్రగతి శీల తల్లిదండ్రుల సంఘం రాష్ట్ర కార్యదర్శి గంగాధర లక్ష్మణ్, కరుణాకర్, మునీందర్ తదితరులున్నారు.

ముందస్తు మహిళా దినోత్సవం



గంభీరావుపేట: కేక్ కట్ చేస్తున్న మహిళా ఉపాధ్యాయురాళ్లు

వేములవాడరూరల్: వేములవాడ మండల పరిషత్ కార్యాలయంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఏశ వాణి, ఎంపీటీసీ చెన్నాడి శ్యామల, సెక్రెటరీలు సంధ్య, శ్యామల, చందన, తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: మండలంలో ముందస్తు మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో మహిళా ఉద్యోగులను తహసీల్దార్ సురేశ్ సన్మానించారు. మండల పరిషత్ కార్యాలయంలో మహిళా అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులను జెడ్పీటీసీ గుండం నర్సయ్య సన్మానించారు. నాయబ్ తహసీల్దార్ సురేశ్, మండల పరిషత్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఏపీఎం దేవరాజు, ఆర్‌ఐ శ్యామ్, సీనియర్ అసిస్టెంట్ సురేశ్, ఐకేపీ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండలంలోని పలు గ్రామాల్లో మహిళా పారిశుధ్య కార్మికులను శాలువాలతో సత్కరించారు. కోరుట్లపేటలో ఎంపీటీసీ సింగారం మధు పంచాయతీ సిబ్బందిని ఘనంగా సన్మానించారు. ముందస్తుగా కేక్ కట్‌చేశారు. ఎంపీడీవో సత్తయ్య, కార్యదర్శి సుస్మిత, అంగన్‌వాడీ టీచర్ హలీయా, ఏఎన్‌ఎం పద్మ, ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కోనరావుపేట: మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని వైస్‌ఎంపీపీ వంగపెల్లి సుమలత అన్నారు. మండల పరిషత్ కార్యాలయం, గ్రామ పంచాయతీ కార్యాలయంలో మహిళా ఉద్యోగులకు సన్మానించారు. ఎంపీటీసీ దేవరకొండ చారి, ఏపీఎం రాకేశ్, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, మహిళాసంఘాల సభ్యురాళ్లు పాల్గొన్నారు.

గంభీరావుపేట: మండల పరిషత్ కార్యాలయంలోని ఉద్యోగులకు, సిబ్బందికి, మహిళా ప్రజాప్రతినిధులకు ఎంపీపీ వంగ కరుణ ఆధ్వర్యంలో సన్మానం నిర్వహించారు. కేజీ టు పీజీ విద్యాసంస్థలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, ఆక్స్‌ఫర్డ్ ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు.

రుద్రంగి: కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ముందస్తు మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. మహిళా అధ్యాపకురాళ్లను స న్మానించి బహుమతులు అందజేశారు. ప్రి న్సిపాల్ హరినాథ్ రాజు, కరస్పాండెంట్ ఎలిగేటి నరేశ్ ఉన్నారు.

తంగళ్లపల్లి: మండెపల్లిలో మాజీ సర్పంచ్ గనప శివజ్యోతి ఆధ్వర్యంలో పలువురు మహిళలను ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయురాళ్లు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా, సఫాయి కార్మికులు, మహిళా సంఘాల అధ్యక్షులు, రేషన్ డీలర్లను శాలువాతో సత్కరించి అనంతరం కేక్ కట్‌చేశారు.

‘బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇవ్వాలి’



తంగళ్లపలి: ధర్నాచేస్తున్న కార్మికులు

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ పూర్తిగా మూతబడగా ప్రభుత్వం స్పందించకపోవడాన్ని నిరసిస్తూ నేతన్నలు గురువారం రోడ్డెక్కారు. గోపాల్‌నగర్ చౌరస్తాలో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపగా ఆసాముల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సిరిసిల్ల రవీందర్ మాట్లాడారు. మూడ్రోజులుగా నుంచి బీవైనగర్‌లోని చేనేత, జౌళిశాఖ ఆఫీస్ ముందు రిలేదీక్షలను చేపడుతున్నామన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన మాదిరిగానే తమకు బతుకమ్మ ఆర్డర్లు ఇచ్చి ఉపాధి కల్పించాలని కోరారు. ప్రభుత్వం సిరిసిల్లలో నూలు బ్యాంక్ ఏర్పాటు చేయాలని కోరారు. నాయకులు చేర్యాల అశోక్, మండల రాజు, తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి(సిరిసిల్ల): కాంగ్రెస్ ప్రభుత్వం నేతన్నల బతుకులతో ఆడుకోవద్దని సీఐటీయూ తెలంగాణ పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ కోరారు. సీఐటీయూ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై గురువారం రాస్తారోకో చేపట్టారు. కోడం రమణ, ఆసాముల సంఘం అధ్యక్షుడు గోనే పర్శరాములు మాట్లాడుతూ నేతన్నల బతుకులకు ప్రభుత్వాలు భరోసా కల్పించలేకపోతున్నాయన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి బతుకమ్మ చీరల ప్రభుత్వ ఆర్డర్లు ఇవ్వాలని కోరారు. కనకయ్య, అన్నల్‌దాస్ గంగాధర్, సామల నర్స య్య, గోరంతల రా జమల్లు, కోడం వేణు, గడ్డం ఎ ల్లయ్య, అంబదాస్, రమేశ్, రాజేశం, శంకర్, సత్యం పాల్గొన్నారు.

వేములవాడ మున్సిపల్ వైస్‌చైర్మన్‌గా బింగి మహేశ్

- ఒక్క సీటున్న కాంగ్రెస్‌కే వైస్‌చైర్మన్ పదవి



ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కౌన్సిలర్లతో బింగి మహేశ్

వేములవాడ: వేములవాడ మున్సిపల్ వైస్‌చైర్మన్‌గా బింగి మహేశ్ ఎన్నికయ్యారు. అడిషనల్ కలెక్టర్ గౌతమి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఎన్నికల్లో మున్సిపల్ పాలకవర్గ సభ్యులు, ఎక్స్‌అఫిషియో మెంబర్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ హాజరయ్యారు. వైస్ చైర్మన్ పదవి రేసులో బింగి మహేశ్, మారం కుమార్‌లు ఉండగా.. బింగి మహేశ్‌కు 18, మారం కుమార్‌కు 11 మంది మద్దతు తెలుపుతూ చేతులెత్తారు. బింగి మహేశ్ వైస్‌చైర్మన్‌గా ఎన్నికైనట్లు ప్రకటించారు. ఆర్డీవో రాజేశ్వర్, మున్సిపల్ కమిషనర్ అన్వేశ్, మేనేజర్ సంపత్‌రెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు. మధు రాజేందర్ తన వైస్‌చైర్మన్ పదవికి రాజీనామా చేయగా ఈ ఎన్నిక అనివార్యమైంది.

ఒక్కసీటున్న కాంగ్రెస్‌కే వైస్‌చైర్మన్ గిరి

వేములవాడ మున్సిపల్ పాలకవర్గంలో మొత్తం 28 మంది సభ్యులు ఉన్నారు. ఇందులో కాంగ్రెస్‌కు కేవలం ఒక్క సభ్యుడు మాత్రమే ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికలప్పటి నుంచి కాంగ్రెస్ పార్టీలోకి వలసలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈక్రమంలో ఒక్క కౌన్సిలర్ ఉన్న కాంగ్రెస్ పార్టీ వైస్‌చైర్మన్ పదవిని కైవసం చేసుకుంది.

‘గృహజ్యోతి’ని సద్వినియోగం చేసుకోవాలి



ఎల్లారెడ్డిపేట: రాచర్ల బొప్పాపూర్‌లో జీరో విద్యుత్ బిల్లు రసీదును అందిస్తున్న నాయకులు



ముస్తాబాద్ : జీరో బిల్లు రసీదు ఇస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: ప్రభుత్వం అమలుచేస్తున్న 200 యూనిట్లు ఉచిత విద్యుత్‌ను నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, జిల్లా కార్యదర్శి పందిర్ల లింగం గౌడ్ అన్నారు. మండలంలోని రాచర్ల బొప్పాపూర్, నారాయణపూర్, సింగారం, పదిర, దుమాల, అక్కపల్లి, బుగ్గరాజేశ్వర తండా, అల్మాస్‌పూర్‌లో గురువారం ఉచిత విద్యుత్ బిల్లు రసీదును అందించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌కే గౌస్, జిల్లా కార్యదర్శి వంగ గిరిధర్ రెడ్డి, నాయకులు కొండపురం శ్రీనివాస్‌రెడ్డి, పందిర్ల సుధాకర్‌గౌడ్, కొంగరి కృష్ణారెడ్డి, బాలపోచయ్య, మహేందర్ రెడ్డి, పద్మారెడ్డి, చిన్న రాజిరెడ్డి, మహేందర్, మధు, పాల్గొన్నారు.

ముస్తాబాద్: ముస్తాబాద్, పోతుగల్, మద్దికుంటలో గృహజ్యోతి పథకాన్ని గురువారం ప్రారంభించారు. ఆరు గ్యారంటీల్లో భాగంగా 200 యూనిట్ల ఉచితంగా విద్యుత్‌ను అమలుచేస్తున్నట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. త్వరలోనే అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని నాయకులు తలారి నర్సింలు, సత్తయ్యగౌడ్, అనిల్ పేర్కొన్నారు.

ఎల్‌ఎండీకి నీటి విడుదల

బోయినపల్లి: మిడ్‌మానేరు నుంచి ఎల్‌ఎండీకి నీటి విడుదల కొనసాగుతోంది. ప్రాజెక్టు రెండు గేట్ల ద్వారా సోమవారం ఎల్‌ఎండీకి 2,500, కుడి కాల్వ ద్వారా 750, ఎడమకాల్వ ద్వారా 10 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులో ప్రస్తుతం 12.64 టీఎంసీల మేర నీరు నిల్వ ఉంది.

కాంగ్రెస్ నాయకుల ధర్నా

సిరిసిల్లటౌన్: ప్రభుత్వ బ్యాంకింగ్ రంగంపై కేంద్ర సర్కారు నిర్లక్ష్యం వహిస్తుందని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్ విమర్శించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపి సర్కారు, ఆర్‌బీఐ తీరును వ్యతిరేకిస్తూ..సిరిసిల్ల ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ ముందు ధర్నా చేపట్టి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వం రంగ సంస్థలను నిర్వీర్యం చేసే విధంగా చర్యలు చేపడుతుందని విమర్శించారు. పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి ప్రసాద్, గడ్డం నర్సయ్య, అమర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

సిరిసిల్లటౌన్: వేతనాలు మంజూరు చేయాలని కోరుతూ రెండో ఏఎన్‌ఎంలు గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ ఆరు నెలల జీతాలు, పీఎఫ్ డబ్బులు, ఇతర బకాయిలు ప్రభుత్వం విడుదల చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే తమకు రావాల్సిన జీతాలు, ఇతర బకాయిలను చెల్లించాలని కోరుతూ డీఎంహెచ్‌వో సుమన్ మోహన్‌రావుకు వినతిపత్రం అందించారు. ఏఐటీయూసీ నాయకులు కడారి రాములు, అజ్జ వేణు తదితరులు పాల్గొన్నారు.

చంపుతామని బెదిరించిన ముగ్గురికి ఏడాది జైలు

సిరిసిల్లక్రైం: ఇంట్లోకి ప్రవేశించి చంపుతామని బెదిరించిన ముగ్గురికి ఏడాది జైలుశిక్షతోపాటు, ఒక్కొక్కరికి రూ.వెయ్యి జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ గురువారం తీర్పు వెల్లడించినట్లు సిరిసిల్లటౌన్ సీఐ రఘుపతి తెలిపారు. పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన దూడం సరస్వతి భర్త ఏడాదిక్రితం ఇంట్లోంచి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి సరస్వతి తన భర్త గురించి గాలిస్తుండగా.. తన భర్త స్నేహితుడు చిట్యాల మధును కలిసి ఆచూకీ కోసం అడిగింది. రజిత అనే మహిళతో కలిసి వెళ్లినట్లు మధు తెలిపాడు. తర్వాత ఎంత వెతికినా భర్త ఆచూకీ లభించలేదు. 2015 జనవరి 28న శాంతినగర్‌లోని సరస్వతి ఇంటికి చిట్యాల మధు, నాయిని శంకర్, దుబ్బ నీరజ వచ్చి.. మీ ఇళ్లను నీ భర్త రూ.25లక్షలకు తమకు విక్రయించాడని, మిగతా రూ.5లక్షలు తీసుకొని ఇంటిని ఖాళీ చేయాలని బెదిరించారు. దీంతో సరస్వతి సిరిసిల్ల టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్సై చిననాయక్ కేసునమోదు చేసి, సాక్షులను విచారించారు. దర్యాప్తు అధికారి అయి న ఎస్సై మల్లయ్య కోర్టులో చార్జిషీట్ దాఖలు చే శారు. సీఎంఎస్ ఎస్సై శ్రావణ్ ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ నరేశ్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్ట గా ప్రాసిక్యూషన్ తరపున పీపీ చెలుముల సందీప్‌కుమార్ వాదించగా కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి ప్రవీణ్.. బెదిరింపులకు పాల్పడిన చిట్యాల మధు, నాయిని శంకర్, దుబ్బ నీరజకు ఏడాది జైలు ఒక్కొక్కరికి రూ.వెయ్యి జరిమానా విధించారు.

సంక్షిప్త వార్తలు

ఆలయ భూమిని రక్షించాలి

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రంలోని విశ్వనాథ స్వామి ఆలయ భూమిని పరిరక్షించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. శాంతినగర్ సమీపంలోని విలువైన ఆలయ భూమితో పాటు, నాలా స్థలం, రోడ్డు స్థలాన్ని ఆక్రమించుకుని ప్లాటింగ్ చేస్తున్నారన్నారు. ఈవిషయంలో చొరవ చూపి ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరారు. సదరు వ్యక్తులు ప్లాటింగ్ చేయడానికి అధికారులు ఇచ్చినా అనుమతులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఘనంగా వార్షికోత్సవం

గంభీరావుపేట: మండలంలోని నాగంపేటలో శ్రీ భక్త మార్కండేయ, షిర్డీ సాయినాథ మందిరం వార్షికోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ జిల్లా నాయకుడు కొండూరు గాంధీబాబు ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. వార్షికోత్సవం సందర్భంగా ఆలయంలో అభిషేకాలు, అలంకరణ, స్వస్తివచనం, కలశస్థాపన, అగ్నిప్రతిష్ఠ, శతరుద్ర సహిత నవ చండీయాగం, శివకల్యాణం నిర్వహించారు.

ఈజీఎస్ గ్రామసభ

గంభీరావుపేట: మండలంలో ఉపాధిహామీ పథకంలో చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ ప్రారంభమైంది. గురువారం మండలంలోని ముస్తఫానగర్‌లో అధికారులు గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో చేపట్టిన పనులపై తనిఖీ అధికారులు, సిబ్బంది తమ నివేదికను చదివి వినిపించారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి, తహసీల్దార్ భూపతి, ఈజీఎస్ అధికారులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రం తనిఖీ

చందుర్తి:మండలంలోని ప్రభుత్వ జూ నియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పరీ క్షా కేంద్రాన్ని స్టేట్ అబ్జర్వర్ ర మణ బృందం గురువారం త నిఖీ చేశారు. 52మంది విద్యార్థులకు గాను 52 మంది హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ మల్లేశ్, డిపార్ట్‌మెంట్ అధికారి ప్రవీణ్ కుమార్ తెలిపారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
సిరిసిల్ల జిల్లా :
9951602934, 9010610963
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
సిరిసిల్ల : రఘు - 7331119957
వేములవాడ : నవీన్ - 7997958211
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899